నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



వాటర్‌లైన్‌మెన్‌లతో సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: నీటి ఎద్దడి రాకుండా చూడాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి జలమండలి అధికారులు, లైన్‌మెన్‌లకు సూచించారు. మంగళవారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో జలమండలి మేనేజర్, లైన్‌మెన్‌లతో తాగునీటి సప్లైపై సమీక్షించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కొన్ని కాలనీలు, బస్తీల్లో తాగునీటి సరఫరా సరిగ్గా లేదని, తమ దృష్టికి వచ్చిందన్నారు. తాగునీటి సరఫరాపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని చెప్పారు. జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, వాటర్ లైన్ మెన్‌లు తదితరులున్నారు.

హబ్సిగూడ సర్కిల్ ఎస్‌ఈగా షామే ప్రతిమ



ఉప్పల్: హబ్సిగూడ సర్కిల్ సూపరింటెండెంట్‌గా షామె ప్రతిమను నియమిస్తూ విద్యుత్‌శాఖ సీఎండీ ముషరాఫ్ ఫారూఖీ ఆదేశాలు జారీ చేశారు. గతంలో అసెస్‌మెంట్‌లో ఎస్‌ఈగా ఆమె పనిచేశారు. హబ్సిగూడ సర్కిల్ ఎస్‌ఈగా విధులు నిర్వహించిన బ్రహ్మం పదవీవిరమణ చేయడంతో ప్రతిమను నియమిస్తూ సీఎండీ ఆదేశాలు జారీ చేశారు.

అలరించిన స్నాతకోత్సవం



విద్యార్థులకు పట్టాలను అందజేసిన తోషిమిట్టల్, ప్రిన్సిపాల్ లలిత

కుషాయిగూడ: కుషాయిగూడలోని రవీంద్ర భారతి పాఠశాలలో మంగళవారం నిర్వహించిన యూకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ఎన్‌ఎఫ్‌సీ సైంటిఫిక్ ఆఫీసర్ తోషిమిట్టల్ హాజరై ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించి రేపటి తరాలు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల ఆసక్తికి తగినట్లుగా ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టాలను అందజేసి అభినందించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ లలిత, డీన్ శ్రీలత తదితరులున్నారు.

'సన్నబియ్యం పంపిణీతో పేదలు సంతోషంగా ఉన్నారు'

కీసర: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్నబియ్యం పంపిణీతో పేదలు సంతోషంగా ఉన్నారని నాగారం మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలో సన్నబియ్యం లబ్ధిదారులు రాగుల లక్ష్మి, గడ్డం కళమ్మ, వంగపల్లి మమత, ఆరుట్ల స్వాతి ఇంటి వద్ద సన్నబియ్యంతో ఏర్పాటు చేసిన భోజనాన్ని కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన తిన్నారు. అనంతరం ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యం పంపిణీపై లబ్ధిదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు.

ఆర్టీసీ బస్సులో పుస్తెల తాడు చోరీకి యత్నం

శామీర్‌పేట్: ఆర్టీసీ బస్సులో వృద్ధురాలి మెడలోంచి బంగారు పుస్తెల తాడును అపహరించేందుకు యత్నించిన మహిళకు తోటి ప్రయాణికులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత వృద్ధురాలు తెలిపిన వివరాల ప్రకారం..మూడుచింతలపల్లి మండలం, నాగిశెట్టిపల్లికి చెందిన దాసరి పార్వతి (65), తన గ్రామానికి వచ్చేందుకు నగరంలోని లాల్‌బజార్ వద్ద సికింద్రాబాద్-కాశిరెడ్డిపల్లి 568 సర్వీసు బస్సు ఎక్కింది. ఆమెను అనుసరిస్తూ మరో మహిళ కూడా అదే బస్సు ఎక్కి, బస్సు రద్దీగా ఉండటంతో వృద్ధురాలి మెడలో ఉన్న 4 తులాల పుస్తెలతాడును అపహరించింది. అనంతరం తూంకుంట మున్సిపాలిటీలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ వద్దకు రాగానే తనకు ఆరోగ్యం సహకరించడం లేదని నిందితురాలు బస్సు దిగి సమీప పొదల్లోకి పారిపోయింది. బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో పాటు బస్సు డ్రైవర్‌కు అనుమానం రావడంతో వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడు చోరీ అయినట్లు గుర్తించారు. దీంతో బస్సు డ్రైవర్, ప్రయాణికులు కలిసి పొదల్లోకి పారిపోయిన మహిళను తీసుకువచ్చి తనిఖీ చేయగా పుస్తెలతాడు లభ్యమైంది. ప్రయాణికులు ఆమెను శామీర్‌పేట పోలీసులకు అప్పగించారు. కాగా పట్టుబడిన మహిళపై 1991 సంవత్సరం నుంచి పలు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు సమాచారం.

కబ్జాలపై హైడ్రా నజర్

శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్





మచ్చబొల్లారం శ్మశానవాటికను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని హిందూ శ్మశానవాటికను కబ్జాచేసి డంపింగ్ యార్డు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మచ్చబొల్లారం రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జేఏసీ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాంకీ సంస్థకు రెండెకరాల స్థలం కేటాయించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇక్కడ ఉన్న ప్రభుత్వ భూమి 3-4 ఎకరాల వరకు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించామని చెప్పారు. తక్షణమే నిర్మాణాలను ఆపేయాలని సదరు సంస్థను ఆదేశించామన్నారు.

ప్రజా ప్రతినిధుల నుంచి ఫిర్యాదులు..

ఈ విషయంపై ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుల నుంచి ఫిర్యాదులు అందాయని, సమస్యను పరిశీలించి పరిష్కార మార్గాలను చూపాలని మంత్రి శ్రీధర్‌బాబు కూడా చెప్పారన్నారు.

డంపింగ్ యార్డులతో ఇబ్బంది..

జనావాసాల మధ్య ఉన్న చెత్త డంపింగ్‌యార్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో చెత్త డంపింగ్ యార్డు తరలించాలని స్థానికులు చేస్తున్న ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

వెంకటాపురం డివిజన్‌లోని గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీని సంబంధిత అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ సందర్శించారు. స్థానిక వివాదంపై సమీక్షించడంతో పాటు ప్రభుత్వ భూములు, సొసైటీ స్థలాల ఆక్రమణకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అల్కాల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నేతలు సురేందర్‌రెడ్డి, జోలి రమేష్, మచ్చబొల్లారం రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ ర్యాలీ



ర్యాలీలో నినాదాలు చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్, సోనీయాగాంధీనగర్, శుభోదయనగర్ కాలనీల్లో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాణ అంబేద్కర్‌ను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని అవమానపరిచేలా బీజేపీ, అనుబంధ సంస్థలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, గణేష్‌నాయక్, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, గడ్డం యాదగిరి, శ్రీకాంత్‌యాదవ్, గోపాల్‌యాదవ్, క్రాంతి, రాజు, వెంకట్, వెంకటేష్, నీరజారెడ్డి తదితరులున్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



మేడ్చల్, మల్కాజిగిరి కోర్టులో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కుషాయిగూడ: న్యాయవాది ముజ్తబా అలీపై దాడిని నిరసిస్తూ మంగళవారం కుషాయిగూడలోని మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ కల్పించడంతో పాటు దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సహచర న్యాయవాదిని ఆసుపత్రిలో పరామర్శించి ధైర్యం చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు మాధవి, ప్రధాన కార్యదర్శి బాపిరెడ్డి తదితరులున్నారు.

'ఎమ్మెల్యేపై కార్పొరేటర్ వ్యాఖ్యలు సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్‌గౌడ్

మల్కాజిగిరి: ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కార్పొరేటర్ శ్రవణ్‌కు లేదని మాజీ కార్పొరేటర్, బీఆర్‌ఎస్ నాయకుడు జగదీష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులపై కార్పొరేటర్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. జీహెచ్‌ఎంసీ అధికారులను పలుమార్లు కలిసి ఎమ్మెల్యే అభివృద్ధి పనుల గురించి వినతిపత్రాలు అందజేశారన్నారు.

◆ మల్కాజిగిరి సర్కిల్‌కు రూ 9 కోట్లు, అల్వాల్ సర్కిల్‌కు రూ.13 కోట్లు మంజూరయ్యాయన్నారు. మరిన్ని నిధులు కావాలని సుమారు రూ. 25 కోట్ల ప్రతిపాదనలతో ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారన్నారు. మల్కాజిగిరి కార్పొరేటర్ తాను ముందే ప్రతిపాదనలు ఇచ్చామనడంలో వాస్తవం లేదన్నారు. ఎస్పీనగర్‌లో మహిళా భవన్ నిర్మాణం తానే చేశాడని చెప్పుకోవడం సరికాదన్నారు.

చలో వరంగల్‌ను విజయవంతం చేయండి



బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే

ఉప్పల్: ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగసభను విజయవంతం చేయాలని ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను వరంగల్ వేదికగా ఎండగట్టడానికి సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో పేద ప్రజల జీవితాలను నాశనం చేశారని, భూముల అమ్మకాల పేరుతో మూగజీవాలను బలి తీసుకున్నారని, విమర్శించారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కారని, ఇప్పటికైనా ప్రజలు మేల్కోవాలని సూచించారు. కార్యకర్తలందరూ వరంగల్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు.

'ప్రమాదకర కోనో కార్పస్ చెట్లను తొలగించాలి'

కుషాయిగూడ: ప్రమాదకరమైన కోనో కార్పస్ చెట్లను పూర్తిగా తొలగించి ఆనవాళ్లు లేకుండా చేయాలని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులను కోరుతున్నారు. చెట్ల తొలగింపుపై స్పందించిన కాప్రా సర్కిల్ డీసీ జగన్ నాయక్ తక్షణమే స్పందించి చెట్ల తొలగింపును చేపట్టారని, డీసీకి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చక్రపాణిగౌడ్, చల్ల ప్రభాకర్, వెంకటేష్, రాజుముదిరాజ్, జనార్దన్, శ్రీకాంత్ తదితరులున్నారు.



వ్యవసాయానికి ఆర్థిక సహాయం పెంచండి

జవహర్‌నగర్: వ్యవసాయానికి పెట్టుబడి సహాయం రూ.6 వేల నుంచి రూ.18 వేలకు కేంద్ర ప్రభుత్వం పెంచాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింహులు, కార్యనిర్వాహక కార్యదర్శి నరేంద్ర ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.2 లక్షల వరకు, పైన ఉన్న రుణమాఫీ రైతులకు పూర్తి స్థాయిలో మాఫీ చేయాలని కోరారు. రైతు భరోసా సాగయ్యే భూములన్నింటికీ యుద్ధప్రాతిపాదికన ఇవ్వాలని, రాష్ట్ర స్థాయి పంటల భీమా పథకాన్ని ఏర్పాటుచేసి అమలు చేయాలన్నారు. వర్షాలు, వడగళ్లకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, ప్రధానమంత్రి రాతపూర్వకంగా ఇచ్చిన హామీ మేరకు పంటలకు కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు ఏప్రిల్ 9న రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



యూజీడీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: యూజీడీ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. వేంకటేశ్వరనగర్‌లో రూ.12 లక్షలతో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఓపెన్ నాలాలు, పాత యూజీడీ ఉన్న చోట కొత్తగా యూజీడీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. దీనివల్ల మురుగు సాఫీగా వెళ్లడానికి ఇబ్బందులు ఉండవన్నారు. వర్షాకాలం కంటే ముందే పనులు పూర్తి చేయాలని సూచించామన్నారు. మేనేజర్ తేజస్విని, బాబు, కిషోర్, అక్తర్ తదితరులున్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో రూ.88 లక్షలతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానికులకు ఇబ్బంది లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జలమండలి మేనేజర్ రవీందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిషన్ తదితరులున్నారు.



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

పెండింగ్‌లో ఉన్న చేయూత పింఛన్లపై శ్రద్ధ చూపాలి

సాక్షి,సిటీబ్యూరో: చేయూత పింఛన్లలో మరణించి కేసులను అప్‌డేట్ చేసి స్పౌజ్‌కు పింఛన్ అందించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సాంబశివరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టరు రాధికాగుప్తా మాట్లాడుతూ..జిల్లాలో మండలాల వారీగా కొన్ని నెలలుగా పంపిణీ కాకుండా బ్యాంకులలో, పోస్టాఫీసుల్లో పెండింగ్‌లో ఉన్న చేయూత పింఛన్లను పరిశీలించి అప్‌డేట్ చేయాలని సూచించారు. పింఛన్‌దారుని ఖాతాలోకి జమ కాకుండా పెండింగ్‌లో ఉండడానికి కారణలైన మరణ/వలస/ఆధార్ అప్‌డేట్ కేసులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని మండలాల్లో ఎక్కువగా ఉన్న



పెండింగ్‌లో ఉన్న కేసులపై మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి క్లియర్ చేయాలన్నారు. సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చిన అప్లికేషన్లను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించి అవసరమై మేరకు టాయిలెట్లు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులను కల్పించాలని అదనపు కలెక్టరు ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌కు వాటర్ ఫిల్టర్లను పంపిణీ చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పునర్నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు తమ వద్ద ఉన్న జనరల్ ఫండ్ నుంచి ఎన్యూమరేటర్లుగా విధులు నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు ఇవ్వాలని ఆదేశించారు. మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల వివరాలను పరిశీలించి, పునఃపరిశీలన చేయాలని కోరారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా కుట్టిస్తున్న విద్యార్థుల యూనిఫాంలను ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత గడువులోగా యూనిఫాంలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కాంతమ్మ, డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసెస్, హౌజింగ్ ఈఈ రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



జలమండలి జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: డివిజన్‌లో పీటీ సూర్యానగర్, నెహ్రూనగర్, సంతోషిమానగర్, ఆఫీసర్స్ కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని జలమండలి జీఎం సునీల్‌కు కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత ఫిబ్రవరి నెలలో ఎండీ అశోక్‌ను కలిసి డివిజన్‌లోని భూగర్భ డ్రైనేజీ పనుల వివరాలను తెలిపామని చెప్పారు. జాన్సీరేఖ, సుజాత, శిరీష, రమణ తదితరులున్నారు.

ఆర్థికసాయం..

గౌతంనగర్: డివిజన్ ఇందిరానెహ్రూనగర్‌లో నివసించే రాజు, బాలమణిల ఇళ్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో ఇంట్లో ఉండే నిత్యావసర సరుకులు, ఎలక్ట్రికల్ పరికరాలు బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మేకల సునీతా రాముయాదవ్ మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించి బాధితురాలు బాలమణిని పరామర్శించారు. అనంతరం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. నాయకులు మేకల రాముయాదవ్ తదితరులున్నారు.

రూ.35 లక్షలతో సీసీరోడ్డు పనులు



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ మంగాపురం కాలనీలో రూ.35 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. మంగాపురం కాలనీలో ఈ రోడ్డు ఇటీవల డ్రైయిన్ పనుల కోసం తవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఇక ఈ రోడ్డుతో సమస్య పరిష్కారమైందన్నారు. కాలనీ అధ్యక్షుడు రాకేష్‌రావు, సభ్యులు హన్మంతరావు, యశ్వంత్‌రావు, పెంటారెడ్డి, శేఖర్ రావు, గోపాల్‌రావు, వెంకటేశ్వర్‌రావు, విజయ్ రావు, సిద్ది రాంరెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రేమ్‌రాజ్, సత్యం, నాయకులు నిమ్మ అశోక్‌రెడ్డి, వెంకటేష్, సంపత్ యాదవ్, లడ్డు, దేవేందర్, కొండయ్య, గౌస్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు



నిందితుడు బచన్ ప్రసాద్‌షా

మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధి పోక్సో కేసులో నిందితుడికి నేరెడ్‌మెట్ కోర్టు 20 ఏళ్ల జైలుశిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించించి. వివరాల ప్రకారం.. నాచారం పోలీస్‌స్టేషన్ పరిధి మల్లాపూర్ మీర్ పేట్‌కు చెందిన బచన్ ప్రసాద్‌షా (64)పై 2021లో పోక్సో కేసు నమోదైంది. విచారణ అనంతరం కేసు పూర్తి వివరాలను నాచారం పోలీసులు కోర్టుకు అందజేశారు. విచారించిన కోర్టు నిందితుడికి రూ.5 వేల జరిమానాతో పాటు 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాలని తెలిపింది.

'చెత్త'శుద్ధి ఏదీ..?



పురపాలక సంఘాల్లో తడి, పొడి సేకరణలో నెరవేరని లక్ష్యం

- డివిజన్లు/వార్డులకు సమయానికి రాక రోడ్లపైనే పారబోత
- పట్టించుకోని మున్సిపల్ కమిషనర్లు.. ఇబ్బందుల్లో ప్రజలు

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు పురపాలికల్లో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతిరోజూ చెత్తను వేరుచేసి సేకరించాల్సి ఉన్నా.. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 29 పురపాలక సంఘాలు ఉండగా, లక్షకుపైగా జనాభా కలిగిన పురపాలికలో రోజూ దాదాపు 65 టన్నులు, లక్ష లోపు జనాభా ఉన్న పురపాలికల్లో 40 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. పురపాలికల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాల్సిన ఉన్నా.. ఎక్కడా సక్రమంగా జరగడం లేదని తెలుస్తోంది. సంబంధిత అధికారులు మాత్రం చెత్త వాహనాలకు మైకులు పెట్టుకొని తడి, పొడి చెత్తను వేరుచేసి అందజేయాలని ప్రచారం చేస్తున్నా..ఆచరణలో అమలు నోచుకోవటం లేదని తెలుస్తోంది.

సమయానికి రాక.. రోడ్లపైనే పారబోత..

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలోని నిజాంపేట, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ నగర పాలక సంస్థలతోపాటు మేడ్చల్, గుండ్లపోచంపల్లి, దుండిగల్, కొంపెల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్కేసర్, పోచారం మున్సిపాలిటీలు ఉండగా, రంగారెడ్డి జిల్లాలో 16 పురపాలక సంఘాలు ఉన్నాయి. ఈ నగరాలు, పట్టణాల్లో చెత్తను తరలించే వాహనాలు వార్డులు/డివిజన్లకు సమయానికి రాకపోవడంతో పురపాలికల్లో పలుచోట్ల చెత్తను రోడ్ల పక్కన పారబోస్తున్నారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో తడి, పొడి చెత్త విభజన జరగడం లేదు. ప్రతి వార్డు/డివిజన్‌కు వాహనంతో పాటు సిబ్బందిని కేటాయించినా సేకరణ విషయంలో అలసత్వం వహిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తేనే స్పందన..

పురపాలికల్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో తడి, పొడి చెత్త సేకరణ అమలు కావడం లేదు. వార్డు అధికారులు చెత్త సేకరణను నిత్యం పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికిని, సక్రమంగా చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప స్పందించటం లేదని తెలుస్తోంది. కొన్ని వార్డుల్లో రెండు, మూడు రోజులకోసారి చెత్త తరలించే వాహనం రావడంతో అప్పటి వరకు ఇళ్లలోనే నిల్వ ఉంటోంది. చేసేది లేక కాలనీలో రోడ్ల వెంట పారబోస్తున్నారు. దీంతో తడి, పొడి చెత్త సేకరణ అమలుకు పునాది పడటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అవగాహన పరిచి తడి, పొడి చెత్త సేకరణ జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం..

పురపాలికల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదనే విషయం ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదని సంబంధిత మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. పట్టణాల్లో వార్డుల వారీగా పరిశీలించి తడి, పొడి చెత్తను వేరుచేసి సేకరించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు. పట్టణ ప్రజలు కూడా ఎప్పటికప్పుడు చెత్త సేకరణలో జరుగుతున్న జాప్యాన్ని తమ దృష్టికి తీసుకురావాలని కోరుతున్నారు.